www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శుక్రవారం | 24 | జూలై | 2026 | పేజీలు: 08

# ఆరుతడి పంటలు మేలు

## సమన్వయంతో సమస్యలకు చెక్

### రాష్ట్ర బీసీ రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్, అక్షిత బ్యూరో :** ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమవతి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, అదనపు కలెక్టర్లు, మూడు జిల్లాల వివిధ శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ..మిగతా 2లో



# వరుణ యాగం అత్యంత పవిత్రం

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

### దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ

### వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలి





**యాదాద్రి భువనగిరి/ అక్షిత బ్యూరో:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన వరుణ యాగం అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు వేదమంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో వారు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి,పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని ప్రార్థించారు. అంతకు ముందు మంత్రి కొండ సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచనం మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు లడ్డు ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ..మిగతా 2లో

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

### కొల్లాపూర్ జర్నలిస్టులకు శుభవార్త

### అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఇంటి స్థలం



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణా రావు సహకారంతో కొల్లాపూర్ మండలానికి చెందిన అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఇంటి స్థలాన్ని ఇవ్వడం కోసం చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం 13వ వార్డు చౌటబెట్ల గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని కొల్లాపూర్ తహసీల్దార్ మాధవి, 13వ వార్డు కౌన్సిలర్ వంగ అనూష రాజశేఖర్ గౌడ్ పరిశీలించారు. తహసీల్దార్ మాధవి మాట్లాడుతూ అర్హులైన ..మిగతా 2లో

# పాఠాలు బోధించి సామర్థ్యాలను పరీక్షించి

### పంతులమ్మగా కలెక్టరమ్మ



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** పాఠాలు బోధించి... అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించింది. జిల్లా కలెక్టర్ కె. హరిత గురువారం ఆసిఫాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా కలెక్టర్ కాసేపు పంతులమ్మగా మారి విద్యార్థులకు ..మిగతా 2లో



# జలసిరితో భూగర్భ జలాల వృద్ధి

### దోడర్నలో ఫామ్ పాండ్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శంకుస్థాపన

### రైతులు పెద్ద ఎత్తున ముందుకు రావాలని పిలుపు

**నిర్మల్, అక్షిత బ్యూరో :** వ్యవసాయ రంగంలో నీటి సంరక్షణకు, భూగర్భ జలాల పెంపుదలకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'జలసిరి' కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని జిల్లా కలెక్టర్ ..మిగతా 2లో

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

**మొదటి పేజీ తరువాయి...**

జర్నలిస్టుల జాబితా సిద్ధం చేసి, త్వరలోనే ఇంటి స్థలాల కేటాయింపు ప్రక్రియ ప్రారంభిస్తామని తహసీల్దార్ మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటబెట్ల గ్రామ సీనియర్ నాయకులు మరికంటి కమలాకర్ రావు మండల పాత్రికేయ సోదరులు పాల్గొన్నారు.

## పాఠాలు బోధించి సామర్థ్యాలను పరీక్షించి

**మొదటి పేజీ తరువాయి...**

స్వయంగా పాఠాలు బోధించారు. విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమైన కలెక్టర్, వారితో పలు ప్రశ్నలు అడిగి అభ్యాస సామర్థ్యాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఓ విద్యార్థినిని తొమ్మిదో ఎక్కం చెప్పమనగా, ఆ విద్యార్థి గడగడా చదివి వినిపించడంతో కలెక్టర్ ఎంతో సంతోషించి, ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు చాక్లెట్లు అందిస్తూ వారిలో మరింత ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తాగునీటి సౌకర్యం, తరగతుల నిర్వహణను పరిశీలించారు. పాఠశాల వంటశాలను తనిఖీ చేసి, నిర్దేశిత మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించాలని వంట నిర్వాహకులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఉపాధ్యాయులకు ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాథమిక విద్యా నైపుణ్యాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు మరింత శ్రద్ధతో బోధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

## జలసిరితో భూగర్భ జలాల వృద్ధి



**మొదటి పేజీ తరువాయి...**

భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. గురువారం కుబీర్ మండలం దోడర్న గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయనున్న ఫామ్ పాండ్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.

గ్రామానికి చెందిన రైతు దంపతులు గోరేకర్ సంతోష్, సాగరల వ్యవసాయ క్షేత్రంలో నిర్మించనున్న ఫామ్ పాండ్‌కు కలెక్టర్ శంకుస్థాపన చేసి, ముందుకు వచ్చిన రైతులను శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం వారి వ్యవసాయ పరిస్థితులు, సాగు విధానాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫామ్ పాండ్‌ల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతి రైతు తమ వ్యవసాయ క్షేత్రంలో ఫామ్ పాండ్ ఏర్పాటు చేసుకోవడం అవసరమని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పంటలకు నీటి అవసరాన్ని తీర్చడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఫామ్ పాండ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొంటూ రైతులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ జలసిరి కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు, రైతులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ జాదవ్ సావిత్రి, ఇతర అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలు మేలు



**మొదటి పేజీ తరువాయి...**

తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం వచ్చే జూన్ వరకు సాధారణ వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నందున అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలని, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న రోజుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉన్నందున నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఆరుతడి పంటల సాగుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్ పామ్ వంటి పంటల సాగును ప్రోత్సహించాలని, పశుసంపద అధికంగా ఉన్న ప్రాంతాల్లో పశుగ్రాస కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల, 250 పడకల ఆసుపత్రి, పీజీ మెడికల్ కళాశాల, కరీంనగర్--హుస్నాబాద్ ఫోర్‌లేన్ రహదారి, అక్కన్నపేట--హుస్నాబాద్ రహదారి విస్తరణ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ఎల్లమ్మ చెరువు అభివృద్ధి వంటి పలు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, కాలువల భూసేకరణ కోసం రూ.250 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఎల్ నినో - వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరీంనగర్ జిల్లా పరిధిలోకి వచ్చే నియోజకవర్గంలోని చిగురు మామిడి, సైదాపూర్ మండలాల్లో పకడ్బందీగా జలసిరి కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు



వివరించారు. ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎల్ఎండిలో నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకొని రాబోయే తాగునీటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 15 రోజులకోసారి భూగర్భ జలాలపై సమీక్షిస్తూ అందుకు అనుగుణంగా అధికారులను అప్రమత్తం చేస్తున్నట్లు వివరించారు. నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తాగునీటి సరఫరా పై సమీక్షిస్తామని పేర్కొన్నారు. వీబీ జీ రామ్-జీ పథకం కింద గ్రామాల వారీగా ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు నిర్మించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, కరీంనగర్ ఆర్డీవో షర్మిల, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, డీఆర్డీఓ గీత, డిపిఓ జగదీశ్వర్, తదితర శాఖలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వరుణ యాగం అత్యంత పవిత్రం

**మొదటి పేజీ తరువాయి...**

బీర్ల అయిలయ్య మాట్లాడుతూ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో నిర్వహించిన వరుణ యాగం అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని అన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, చెరువులు, కుంటలు,జలాశయాలు నిండి ప్రజలకు ఎలాంటి నీటి ఇబ్బందులు లేకుండా ఉండాలని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, యాదగిరిగుట్టను దేశంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం,ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని బీర్ల అయిలయ్య తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు మంచి పంటలు పండాలని స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని



ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భవాని శంకర్ దేవస్థానం అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా



### విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం
### ప్రజల ప్రాణాలతో చెలగాటం

**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** కమలాపూర్ ఎస్సీ కాలనీలో ఇళ్లపైకి ప్రమాదకరంగా వంగిన పాత విద్యుత్ స్తంభం, ఇప్పటికే రెండుసార్లు తెగిపడిన విద్యుత్ వైర్లు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి.ప్రమాదం కళ్లముందే కనిపిస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

కాలనీలో ఉన్న భారీ అల్లనేరేడు చెట్టు కొమ్మలు విద్యుత్ వైర్లకు తగులుతుండటంతో వైర్లు పదేపదే తెగిపడుతున్నాయని స్థానికులు చెబుతున్నా, చెట్టు కొమ్మలను తొలగించడం, పాత స్తంభాన్ని మార్చడం, కొత్త వైర్లు ఏర్పాటు చేయడం వంటి కనీస చర్యలు కూడా అధికారులు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఏదైనా ప్రమాదం జరిగితే ఎలా**

అధికారులు వస్తామని చెప్పి వెళ్లిపోతున్నారే తప్ప, శాశ్వత పరిష్కారం చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని, ఎప్పుడు స్తంభం కూలినా , వైర్లు తెగిపడినా భారీ ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి పాత స్తంభం, దెబ్బతిన్న వైర్లను మార్చడంతో పాటు ప్రమాదకరంగా ఉన్న చెట్టును తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు..

## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా
# అడవిదేవులపల్లిలో మోడీ దిష్టిబొమ్మ దహనం

**అడవిదేవులపల్లి,అక్షిత ప్రతినిధి:** దిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత,లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ, విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీఛార్జ్‌ను ఖండిస్తూ అడవిదేవులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ నిరసనలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నేతను అరెస్టు చేయడం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని విమర్శించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి వంటి ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకోవడం కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం అత్యంత



దురదృష్టకరమని, ప్రజాస్వామ్య హక్కులను అణిచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.రాహుల్ గాంధీని బేషరతుగా విడుదల చేయాలని, విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాలు నాయక్, బండి నాగేశ్వరరావు,హనుమంతు,బండి నరసింహారావు, కొర్ర అశోక్ నాయక్, హనుమయ్య, దస్రు, దేశ్య, మోతీలాల్, సోమా, హాము, స్వామి, లాలు, చిరంజీవి, జైలాల్, చంప్లతో పాటు కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెల్దండ కల్వకుర్తి మండలా లకు చెందిన లబ్ధిదారులకు
# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం నాడు హైదరాబాద్‌లోని తన నివాసంలో వెల్దండ, కల్వకుర్తి, కడ్తాల్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



అనంతరం కడ్తాల్ మండలం సరికొండ గ్రామపంచాయతీ పరిధిలోని బోయన్‌గుట్ట తండా వాసులు తమ తండాలో నిర్వహించనున్న తీజ్ పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే గారిని ఆహ్వానించారు.వారి ఆహ్వానాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం కార్యక్రమానికి హాజరవుతానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు,కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## రవీంద్ర భారతిలో జులై 26న పోతురాజుకు సత్కారం



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** గత సంవత్సరం ఆవిష్కరణ జరిగిన 'నాన్నే నాహీరో'పుస్తక రచయిత ఆవుల పోతురాజు ఈనెల 26న హైదరాబాదు రవీంద్రభారతిలో జరిగే కార్య క్రమంలో సత్కారం పొందను న్నారు. తెలుగు సాహితీ వనం సంస్థ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈ సత్కారం జరగనుంది. ఈ సంస్థ బాల సాహిత్య విభాగంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కవుల పుస్తకాలను బహుమతి ఎంపిక నిమిత్తం సేకరించింది. అధిక సంఖ్యలో వచ్చిన బాల సాహిత్య రచనలలో ప్రథమ బహుమతికి వడ్డేపల్లి వెంకటేష్ ఎంపిక కాగా ప్రోత్సాహక బహుమతికి ఆవుల పోతురాజు ఎంపికయ్యారు.

పోతురాజు నేపథ్యం తెలుసుకుని... బహుమతికి ఎంపిక నిమిత్తం సేకరించిన పుస్తకాలలో రచయిత ప్రతిభా స్థాయిని గుర్తించి ఎంపిక చేసారు.రచనతో పాటు పోతురాజు కుటుంబ నేపథ్యం కూడా ప్రోత్సహక బహుమతికి ఒక కారణమయింది.సంచార జాతుల కుటుంబానికి చెందిన ఆవుల పోతురాజు గుడారంలో నివసిస్తూ చదువుతో పాటు తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించడం తెలుగు సాహితీ వనం నిర్వాహకులు శాంతికృష్ణను స్పందింప చేసింది.

ఆదివారం రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ఎం.ఎల్.ఎస్.స్నిగ్ధారెడ్డి సాహిత్య పురస్కారాన్ని తెలుగు సాహితీ వనం వార్షికోత్సవ వేడుక వేదికగా ఆవుల పోతురాజు అందుకోనున్నారు.

**నా ప్రతిభకు మెరుగులు దిద్ది ప్రోత్సహించారులి ఆవుల పోతురాజు**

రవీంద్రభారతిలో బాల సాహిత్య సత్కారానికి వెళు తున్నాను.సత్తుపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకుని ప్రస్తుతం గంగారం సాయిస్ఫూర్తిలో ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతున్నాను.నాలోని రచనా ప్రతిభను గుర్తించిన తెలుగు మేడమ్ రమాదేవికి,పుస్తక ప్రచురణ చేసిన "గార్లపాటి–బొల్లేపల్లి" ట్రస్ట్ నిర్వాహకులు రామకృష్ణ మధుసూదన రాజు లకు,పుస్తకాన్ని ఆవిష్కరించిన సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్కే సోందు లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

## చిట్యాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్



**అక్షిత బ్యూరో జయశంకర్ భూపాలపల్లి :** జిల్లాలో పోలీసు సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ గురువారం చిట్యాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఎస్పీ స్టేషన్‌లోని పలు కీలక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిపై అధికారులతో సమీక్షించారు. భద్రతా చర్యలు సీసీ కెమెరాల పనితీరును, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేశారు.

సత్వర పరిష్కారం బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని, దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. అనంతరం పోలీస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ గారు మాట్లాడుతూ... శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు మరింత నాణ్యమైన, బాధ్యతాయుతమైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించారు.

## ఈనెల 27న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జర్నలిస్టుల నిరసన

### ఐఎఫ్డబ్ల్యూజే జాతీయ కమిటీ సభ్యులు చుంచు ఐలయ్య



**భీమదేవరపల్లి, అక్షిత ప్రతినిధి:** ఈనెల 27న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద టిడబ్ల్యూజేఎఫ్, ఐఎఫ్డబ్ల్యూజే ఆధ్వర్యంలో దేశవ్యాప్త జర్నలిస్టుల నిరసన కార్యక్రమం ఉంటుందని ఐఎ ఫ్డబ్ల్యూజే జాతీయ కమిటీ సభ్యులు చుంచు ఐలయ్య తెలిపారు. గతంలో రద్దు చేసిన రైల్వే రాయితీ పాసుల పునరుద్ధరణ, జర్నలిస్టుల రక్షణ చట్టం అమలు, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై నిరసన ఉంటుందన్నారు. జర్నలిస్టులు అధిక సంఖ్యలో నిరసన కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలన్నారు.

## రాజన్న సిరిసిల్లలో కాంగ్రెస్ ర్యాలీ

### ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం




**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌక్ నుంచి గాంధీ చౌక్ వరకు జరిగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టినట్లు నాయకులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జి అప్రజాస్వామికమని, రాహుల్ గాంధీ అరెస్టు కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చంద్రకళ ఆకునూరి బాలరాజ్ కత్తెర దేవదాస్ కలీం దామోదర్ రాగుల జగన్ సామల రోజా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన అదనపు కలెక్టర్లు



**మహబూబ్ నగర్ ,అక్షిత న్యూస్:** ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే లియెన్నం శ్రీనివాస్ రెడ్డికిలి మంత్రి హోదా లభించిన సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు హరిప్రియ, మధుసూదన్ నాయక్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడంలో అంకితభావంతో పనిచేస్తున్న లియెన్నం శ్రీనివాస్ రెడ్డికిలి మంత్రి హోదా లభించడం మహబూబ్‌నగర్ జిల్లాకు గౌరవకారణమని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో జిల్లా అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నవీన్ , ఇతర అధికారులు పాల్గొని ఎమ్మెల్యేకి అభినందనలు తెలిపారు.

# వరంగల్ జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెంపొందించాలి

### రైతాంగానికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించలి

### వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగ అభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టిపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్ లో ప్రశ్నించారు. జిల్లాలో కేంద్ర పథకాల అమలు, వాటి ఫలితాలపై కేంద్ర ప్రభుత్వంన్ని వివరాలు కోరారు.

ఈ మేరకు వరంగల్ ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గత మూడేళ్లలో ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎమ్‌ఈ) పథకం కింద వరంగల్ జిల్లాలో 147 ప్రాజెక్టులు మంజూర య్యాయని కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం 171 యూనిట్లు కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, వీటి ద్వారా రూ. 18.91 కోట్ల పెట్టుబడులు సమకూరాయి. రూ. 4.15 కోట్ల సబ్సిడీ మంజూరై 549 మందికి ఉపాధి లభించినట్లు తెలిపింది.

ఈ అంశంపై స్పందించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వ్యవసాయాధారిత జిల్లాగా ఉన్న వరంగల్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగ విస్తరణ రైతులు, యువతకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. పంట అనంతర నష్టాల నివారణ, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ, గ్రామీణ ఉపాధి పెంపు లక్ష్యాలతో కేంద్ర పథకాలను మరింత సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వరంగల్ జిల్లాలో మరిన్ని ప్రాసెసింగ్ యూనిట్లు, నిల్వ కేంద్రాలు, విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు. వరంగల్ రైతాంగానికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు.

## కిష్టాపూర్ గ్రామంలో వికసిత భారత్ అభివృద్ధి పనులకు శ్రీకారం...

### గ్రామీణ ప్రాంతాల పురోగతే ధ్యేయం సర్పంచ్ దోమల భోజన్న



**లోకేశ్వరం, జూలై 23 అక్షిత న్యూస్ :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం లోని కిష్టాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 'వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ మరియు ఆజీవికా మిషన్'కింద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. గురువారం గ్రామ సర్పంచ్ దోమల భోజన్న, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బోర్వెల్ రీఛార్జ్ పనులకు,రైతు కుంట సుదర్శన్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఫామ్ పాండ్ (పాడి కుంట) నిర్మాణానికి పండితుల నడుమ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం, స్వచ్ఛ భారత్ మిషన్ కింద గ్రామ సమైఖ్య సంఘ భవనం ఆవరణలో నిర్మించనున్న సి. ఎస్. సి (కమ్యూనిటీ శానిటరీ సెంటర్) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాన్ని పెంచడంతో పాటు, పారిశుధ్య లోపాలు తలెత్తకుండా ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ,వి. బి. జి. రామ్. జి ఈసీ అనిల్,సెర్ప్ ఏపీఎం భోజన్న, పంచాయతీ కార్యదర్శి శైలజ,ఉపసర్పంచ్ నాగమణి సుమన్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రవికుమార్,ఫీల్డ్ అసిస్టెంట్ అంబకంటి శ్రీనివాస్,గ్రామ సమైఖ్య సంఘం అధ్యక్షురాలు ప్రణీత,మాజీ ఉపసర్పంచ్ సాదిరి సురేందర్,తో పాటు స్థానిక నాయకులు మహేష్ గౌడ్, శ్రీధర్ రెడ్డి,సాయికుమార్, భరత్ గౌడ్,వివో సీసీ రాజేశ్వర్,వివోఏ శ్రీనివాస్, గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు...

## సమాజంలో ప్రతి ఒక్కరు దైవచింతన భక్తి భావంతో మెలగాలి

### కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** సమాజంలోని ప్రతి ఒక్కరూ దైవచింతన భక్తి భావంతో మెలగాలని ప్రపంచ మానవాళి సుఖశాంతులతో జీవించాలని చేస్తున్న విశ్వశాంతి మహాయాగం ఎంతో గొప్పదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ మైదానంలో నిర్వహిస్తున్న విష్ణు పంచాయతనం,ఆయుత చండి, అతి రుద్రం,విష్ణు పంచాయతనం,శ్రీకృష్ణ కాలచక్ర, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేక కార్యక్రమాలతో పాటు హోమాలు, కుంకుమార్చ నలు, కళ్యాణ మహోత్సవాలు నిర్వహిస్తూ మానవాళి సుఖశాంతులతో జీవించాలని నిర్వహిస్తున్న యాగం కల్వకుర్తి ప్రజలకే కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ మంచి చేయాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు,వ్యాపారులు, సమాజంలోని ప్రతి ఒక్కరు సుఖశాంతులతో జీవించాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సమాజ హితం కోసం చేస్తున్న యాగాలు ఫలితాలు ఇచ్చి అందరికీ మంచి జరగాలని జయపాల్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి మాట్లాడుతూ భక్తులు,ప్రజలు కుల మతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి యాగంలో భాగస్వాములు అవుతుండడం ఆనందదాయకమన్నారు. ప్రపంచ మానవాళి అంతా సుఖ సంతోషాలతో జీవించాలని సంకల్పంతో యాగాలు ప్రారంభించినట్లు తెలిపారు. గురువారం యాగ ఆవరణలో రుత్వికులు వేదమంత్ర ల ఉచ్చరణతో కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం శ్రీ లక్ష్మి కుబేర,పాశుపత,అష్టలక్ష్మి,గురు గ్రహ హోమాల ను నిర్వహించారు.సాయంత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగ లా జరిగింది హనుమాన్ చాలీసా,భగవద్గీత పారాయణం,భజనలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు 3000 మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్,మాజీ ఎంపీపీ కొండూరు గోవర్ధన్,జూలూరు రమేష్ బాబు,కల్వ మనోహర్,పోలా సురేందర్, కల్మిచర్ల గోపాల్,బాదం రాఘవేందర్,వాసా శేఖర్, శ్రీధర్,కిషన్,జంగయ్య గౌడ్,మదన మురళి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు మహిళలు ప్రముఖులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# పులివీరన్న ఆశయాలే మనకు మార్గదర్శకం

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**





**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** పులివీరన్న ఆశయాలే మనకు మార్గదర్శకం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. తొలి తెలంగాణ ఉద్యమకారులు మహబూబ్ నగరానికి చెందిన ప్రముఖ ప్రజానాయకుడు, మాజీ శాసనసభ్యుడు, ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా సేవలందించిన పులివీరన్న గారి 80వ జయంతి సందర్భంగా గ్రీన్ బెల్ట్, పద్మావతి కాలనీలో గల వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పులివీరన్న కీలక పాత్ర పోషించిన మహానాయకుడని కొనియాడారు. 1969 తెలంగాణ ఉద్యమంలో యువకుడిగా ఆయన చేసిన పోరాటం, ధైర్యసాహసాలు నేటికీ ప్రేరణగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రజలు ప్రేమతో ఆయనకు "పులి" అనే బిరుదు ఇచ్చి "పులివీరన్న"గా పిలిచారని గుర్తు చేశారు. పులివీరన్న ప్రజల పట్ల అపారమైన ప్రేమతో, నిస్వార్థ సేవతో పనిచేసిన నాయకుడని పేర్కొన్నారు.

మహబూబ్ నగర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. రాజకీయాల్లో సోదరభావం, పరస్పర గౌరవం ఉండాలని ఆయన చూపిన మార్గం నేటి తరం నాయకులు అనుసరించాల్సిన అవసరం ఉందని సూచించారు. పులివీరన్న సహచర్యంలో పనిచేసిన వారు ఆయనతో గడిపిన అనుభవాలను ఈ సందర్భంగా స్మరించు కుంటూ, ఆయన వ్యక్తిత్వాన్ని కొనియాడారు. ఆయన మరణించిన తరువాత కూడా ప్రజల మదిలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉండటం ఆయన గొప్పతనానికి నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. పులివీరన్న ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆయన చూపిన మార్గంలోనే నడవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రాజకీయాలు అనేది కేవలం ఎన్నికల వరకే పరిమితం చేసిన నాయకులు పులి వీరన్న పి. చంద్రశేఖర్ అని వారు ఇరువురు రాజకీయాలకు గొప్ప నిర్వచనం చెప్పారని ఆయన గుర్తు చేశారు. మహబూబ్ నగర చరిత్రలో పులివీరన్న శాశ్వతంగా నిలిచిపోయే నాయకుడిగా గుర్తుండిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు వేముల కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమరేందర్ రాజు , మైత్రి యాదయ్య కార్పొరేటర్లు, పులి వీరన్న కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదు లక్షల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి

**ప్రభుత్వ ఆర్థిక సహాయం.. నెరవేరిన స్వప్నం**

**దశాబ్దాల కల నెరవేరిన వేళ**

**అద్దె భారం.. ఇబ్బందులు దూరం**

**సొంత ఇంట్లో సంబురం**

**ఇప్పటివరకు 3,470 ఇండ్ల నిర్మాణాలు పూర్తి**

**లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో రూ.216 కోట్లు జమ**





**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** అర్హులైన వారు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్మించుకోవాలనే సదుద్దేశంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇంది రమ్మ ఇండ్ల పథకంతో సొంత ఇంటి కల నెరవేరతున్నది. రూ.ఐదు లక్షల ఆర్థిక సహాయంతోనే లబ్ధిదారుల దశాబ్దాల కల సాకారమై వారి స్వగృహం సొంతమవుతున్నది. అద్దె భారం, ఇబ్బందులు దూరమై ఆ ఇందిరమ్మ ఇండ్లు ఆనందం, ఆత్మ గౌరవ ప్రతీకకు వేదికగా నిలుస్తున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 3,470 ఇండ్లు పూర్తి కాగా, రూ. 216 కోట్లు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి.

అర్హులైన వారు సొంతిల్లు కట్టుకునేలా ఆర్థిక సాయం అందించి మద్దతుగా నిలవాలని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అర్హులు తమ సొంత స్థలంలోనే నిర్మించుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానించి.. ఇండ్ల నిర్మాణానికి దశల వారీగా మొత్తం రూ. ఐదు లక్షలు అందజేస్తుంది.

**వేగంగా ఇండ్ల నిర్మాణాలు..**

ప్రజా ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం పక్కా ప్రణాళిక ప్రకారం పథకాన్ని లబ్ధిదారులకు అందిస్తూ.. వారి ఇబ్బందులు దూరం చేస్తుంది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ.. అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ.. పనుల్లో వేగం పెరిగేలా మార్గ నిర్దేశం చేస్తున్నారు. దీంతో

ప్రజా ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటూ తమ కలను సాకారం చేసుకుంటున్నారు.

**రూ. 216 కోట్లు బ్యాంక్ ఖాతాల్లో జమ**

మొత్తం ఇండ్లు 7,367మంజూరు చేశారు. 5,932 ఇండ్లకు ముగ్గు పోశారు. బేస్ మెంట్ స్థాయిలో 5,138 ఉన్నాయి. గోడల స్థాయిలో 4,534 ఉండగా, 4,229 ఇండ్లు స్లాబ్ స్థాయిలో ఉన్నాయి. 3,470 ఇండ్లు పూర్తి అయ్యాయి. లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో మొత్తం 216 కోట్ల రూపాయలు నేరుగా జమ అయ్యాయి. ఇండ్లు పూర్తి అయి.. పండుగ వాతావరణంలో గృహ ప్రవేశాలు పూర్తి అయ్యాయి.

**ప్రభుత్వ సహాయం.. సద్వినియోగం..**

జిల్లాలోని చందుర్తి మండలం కట్టలింగంపేట గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు తమ సొంత స్థలంలో ప్రజా ప్రభుత్వం విడతల వారీగా అందజేసిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని రూ. 5 లక్షలలోపే తమ సొంత ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకొని తమ దశాబ్దాల కలను నెరవేర్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంతో పడుతున్న ఇబ్బందులు, అద్దె భారాలు దూరమై స్వగృహకల నెరవేరిందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందించిన సహాయం లోనే అధికారుల సూచనల మేరకు లబ్ధిదారులు ప్రతి పనికి ప్రణాళిక ప్రకారం డబ్బులు ఖర్చు చేసి ప్రభుత్వ ఆర్థిక సహాయంతోనే ఇండ్లను పూర్తి చేసుకోవడం మంచి పరిణామం.

**ఇల్లు లేక చాలా ఇబ్బంది పడ్డం**

**పల్లికొండ మౌనిక, కట్టలింగంపేట, చందుర్తి మండలం**

నా పేరు పల్లికొండ మౌనిక. మేము సొంత ఇల్లు లేక చాలా ఇబ్బంది పడ్డం. అద్దె ఇంట్లో ఉండి కిరాయి చెల్లిస్తూ ఆర్థికంగా సమస్యలు ఎదురుకున్నాము. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి దరఖాస్తు చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం అందించిన రూ. 5 లక్షల్లోనే ఇల్లు కట్టుకున్నాం. ఇల్లు ఇప్పించి.. ఆర్థిక సహాయం మంజూరు చేయించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గారికి ధన్యవాదాలు.

## జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నూతన జనరేటర్ ప్రారంభం



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాల యాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన జనరేటర్‌ను జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) రాథోడ్ రమేష్ గురువారం ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ, విద్యుత్ అంతరాయాల సమయంలో కూడా కలెక్టరేట్‌లోని కార్యాలయాల పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ నూతన జనరేటర్ ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, సిబ్బంది పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సంజీవపూర్‌లో ఘనంగా వనమహోత్సవం ఇంటింటికి 6 మొక్కల పంపిణీ

**సర్పంచ్ మధురాజు మహిపతి**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వ హరితహారం కార్యక్రమంలో భాగంగా పెద్దకొత్తపల్లి మండలం సంజీవపూర్ గ్రామపంచాయతీలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయడం జరిగింది. కలప, పండ్ల మరియు ఔషధ మొక్కలను లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పంపిణీ చేసిన మొక్కలను బాధ్యతగా పెంచి గ్రామాన్ని పచ్చదనంతో నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధురాజు మహిపతి, గ్రామ ఉపసర్పంచ్ వేనేపల్లి ప్రశాంత్ రావు, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీ పవన్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ నాగమణి, ఫీల్డ్ అసిస్టెంట్ కురుమయ్య, గ్రామ పెద్దలు భాష మౌని సైదులు గ్రామ వార్డ్ మెంబర్స్ భాష మౌని ఆంజనేయులు, తిక్కల వెంకటేష్, బోరం మంజుల, మక్తల నరసింహ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉప్పల ఆశ్రమ పాఠశాల..కళాశాల విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేసిన ఉప్పల వెంకటేష్ అన్న కుటుంబ సభ్యులు



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్న నిర్వహిస్తున్న ఉప్పల ఆశ్రమ పాఠశాల కళాశాలలో చదువుతున్న 400 మంది తల్లిదండ్రులు లేని మరియు పేద విద్యార్థినులకు ఏకరూప దుస్తువుల (యూనిఫామ్)లకు ఉప్పల వెంకటేష్ అన్న కుటుంబ సభ్యులు ఉప్పల మంజుల అక్క చిరంజీవి" ఉప్పల వేదక్ష్ చేతుల మీదుగా విద్యార్థినులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ మరియు ఉప్పల వెంకటేష్ అన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బాబోయ్ కుక్కలు!

**పట్టణ కేంద్రంలో హడలిపోతున్న ప్రజలు**

**కుమ్మరి వాడ, గాంధీ స్ట్రీట్‌లో గుంపులు గుంపులుగా స్వైరవిహారం**

**ద్విచక్ర వాహనదారులు, పాదచారులపై దాడులు**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** వీధి కుక్కల సంచారం రోజు రోజుకూ పెరుగుతోంది. ఎక్కడ చూసినా గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రధాన రహదారులు, కాలనీల్లో కుక్కలు గుంపులు గుంపులగా తిరిగి ద్విచక్ర వాహనదారులు, పాదచారుల వెంటపడుతున్నాయి. ఒంటరిగా వెళ్తే దాడి చేసి గాయపరుస్తుండడంతో రామన్నపేట పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు.వీటి సంతతి పెరగకుండా చర్యలు చేపట్టాల్సిన మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఆయా కాలనీల్లో కూడళ్ల వద్ద వీధి కుక్కల గుంపులు తిష్టవేయడంతో భయానికి ఎవరైనా తోడు లేనిదే బయటకి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. అధికారులు ఇప్పటికైనా స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## హరితహారం

**పచ్చదనమే మన ఊరి భవిష్యత్తు**

**మొక్క నాటుదాం, భూమిని కాపాడుదాం**

**మొక్కలను ఇంటింటికి పంపిణీ చేసిన సర్పంచ్ పాత్లావత్ లాలీ బాలు నాయక్**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం, మారేడుమాన్ దీన్నె తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన హరితహారంలో భాగంగా గ్రామ సర్పంచ్ పాత్లావత్ లాలీ బాలు నాయక్ గ్రామంలోని ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేశారు. గత మూడు నెలల క్రితం గ్రామ నర్సరీలో వివిధ రకాల మొక్కలను నాటి సంరక్షించారు. వాటిని గురువారం లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి అందించారు. కలప, పండ్ల, ఔషధ మొక్కలను రైతులకు, గృహస్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం 2 మొక్కలు నాటి మొక్కలను సంరక్షించాలి. పచ్చదనం పెంచడమే మన లక్ష్యం. మొక్కలు నాటడంతో పాటు వాటిని పెంచే బాధ్యత కూడా మనదే చెట్లను రక్షిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం. చెట్లను నాటుదాం ఆరోగ్యంగా ఉందాం చెట్లు నాటి కాలుష్యాన్ని నిర్మూలిద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపిటి తమటం వెంకటస్వామి గౌడ్, గ్రామ ఉపసర్పంచ్ గన్నోజు రామ్మోహన్, వార్డు మెంబర్ దేవి శ్రీను నాయక్ గ్రామ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్ ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పేపర్ లీక్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్ష పేపర్ లీక్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని ఖండిస్తూ సిపిఎం పార్టీ ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా గురువారం నల్లగొండలో జిల్లా సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం కొనసాగించారు. కార్యక్రమంలో మిర్యాల గూడ మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, సిపిఎం నాయకులు ఎం.సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, పి.నాగార్జున, ప్రభావతి, శ్రీశైలం వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో కాంగ్రెస్ నాయకుల నిరసన, ర్యాలీ..

**విద్యార్థి జీవితాలతో చెలగాటమాడుతున్న బీజేపీ ప్రభుత్వం...**

**రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం....**

**నీట్ ప్రశ్న పత్రాల లీకేజ్ నిందితులను కఠినంగా శిక్షించాలి..**



**చౌటుప్పల్ / అక్షిత న్యూస్:** ఢిల్లీలో నీట్ పరీక్ష పత్రాల లీకేజీ అంశంపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై జరిగిన లాఠీఛార్జ్‌ని,వారికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ గురువారం చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల ప్రకారం మండల, మున్సిపల్ కాంగ్రెస్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఢిల్లీ వేదికగా జంతర్ మంతర్ వద్ద ప్రశ్న పత్రాల లీకేజీ విషయంపై కేంద్ర ప్రభుత్వంపై నీట్ విద్యార్థులు నిర్వహిస్తున్న నీట్ విద్యార్థులపై జరిపిన లాఠీ చార్జిని ఖండిస్తూ ప్రధాని మోడీ రాజీనామా చేయాలని, దేశంలోని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పరీక్ష పత్రాల లీకేజీపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం దారుణంగా లాఠీఛార్జ్ చేయించడం దుర్మార్గమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్యార్థి,యువత జీవితాలతో చెలగాడటం ఆడుతూ విద్యార్థి వ్యతిరేక చర్యలకు పాల్పడటం దుర్మార్గమని అన్నారు. నష్టపోయిన విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన రాహుల్ గాంధీని పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం యువత, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ నాయకులు చేశారు. దేశ భవిష్యత్తు,విద్యార్థుల శ్రేయస్సు కోసం బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయ దేవేందర్,కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ అధ్యక్షులు మోగదాల రమేష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, షాది ఖానా చైర్మన్, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, నాయకులు గుండు మల్లయ్య, చెన్నగోని ఆంజయ్య, బొంగు జంగయ్య, మొగుదాల రమేష్, మాజీ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ, బత్తుల విప్లవ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుబ్బాక ఆకాశరెడ్డి, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచ్లు, యువజన కాంగ్రెస్ నాయకులు,ఐఎన్టియుసి నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## యువతను, దేశాన్ని మోసం చేస్తున్న మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి!

**లింగాల మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నారాయణ గౌడ్**

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** యువతను, దేశాన్ని మోసం చేస్తున్న మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలనీ లింగాల మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నారాయణ గౌడ్ అన్నారు గురువారం లింగాల బిడ్డల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ మరియు..రంగినేని శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు..లింగాల పట్టణ కేంద్రంలో పట్టణ సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ బుడ్డయ్య ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ మరియు కేంద్ర హోం మంత్రి అమిత్ షా,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ల దిష్టిబొమ్మలను దహనం కార్యక్రమంలో పాల్గొన్న మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు.ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు నారాయణ గౌడ్ మాట్లాడుతూ.. దేశానికి వెన్నుముక లాంటి విద్యార్థులు, నిరుద్యోగ యువత తమ న్యాయమైన హక్కుల కోసం, తమ భవిష్యత్తు కోసం ఢిల్లీ వీధుల్లో ప్రశాంతంగా నిరసన తెలుపుతుంటే... కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వారిపై పోలీసులతో అమానుషంగా దాడి చేయించింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పోరాడుతున్న మన ప్రియతమ నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ నిలి అక్రమంగా అరెస్టు చేయించారు.



ఈ అహంకార పూరిత చర్యను అచ్చంపేట నియోజకవర్గం తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం!.దేశాన్ని ఏలుతున్నది ప్రజాస్వామ్య ప్రభుత్వమా? లేక విద్యార్థుల భవిష్యత్తును అమ్ముకునే వ్యాపార ప్రభుత్వమా?.

**నీట్ పేపర్ లీకేజీ దోపిడీ:.**

లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి డాక్టర్ కాబడాలని కలలు కంటే, మోదీ రాజ్యంలో ఆ కలలు, ప్రశ్నపత్రాలు రూ. కోట్లకు అమ్ముడుపోతున్నాయి.

విద్యార్థుల కష్టాన్ని, తల్లిదండ్రుల త్యాగాలను మోదీ సర్కార్ వ్యాపారంగా మార్చేసింది. ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి!

**మరొక్కసారి చరిత్ర తిరగేసి చూడండి!.**

గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విద్యార్థుల భవిష్యత్తుకు, యువత ఆకాంక్షలకు అత్యున్నత ప్రాధాన్యత లభించింది..

యుపిఎ కాంగ్రెస్ హయాంలో లక్షలాది ఉద్యోగాలు, ఐఐటీలు , ఐఐఎంలు కేంద్రీయ విద్యాలయాలు ఏర్పడ్డాయి. నాడు ప్రశ్నాపత్రాల లీకేజీలు లేవు, పరీక్షా వ్యవస్థలపై నమ్మకం ఉండేది. విద్యార్థులు, యువత రోడ్డెక్కితే వారి సమస్యలు విని పరిష్కరించే సంస్కృతి కాంగ్రెస్‌ది. కానీ నేడు మోదీ రాజ్యంలో యువతకు దక్కింది ఏంటి? ఉద్యోగాలు లేవు, ఉన్న పరీక్షలైనా సరిగ్గా జరగవు... అడిగితే లాఠీచార్జీలు, అరెస్టులు! మీరు ఎంతగా దాడి చేయించినా, ఎన్ని అరెస్టులు చేసినా కాంగ్రెస్ పార్టీ భయపడదు. యువత తరపున, విద్యార్థుల తరపున రాహుల్ గాంధీ గారి నాయకత్వంలో మా పోరాటం ఆగేది లేదు.. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు అచ్చంపేట గడ్డ నుంచి ఢిల్లీ దాకా మా నిరసన గళం వినిపిస్తూనే ఉంటుంది. ఈ కార్యక్రమంలో సురాపూర్ సర్పంచ్ శేఖర్. కోమటికుంట వెంకటయ్య గౌడ్. దారారం వినోద్. సురాపూర్ తిరుపతయ్య. సురాపూర్ చెన్నయ్య. రాయవరం మాజీ సర్పంచి మల్లయ్య. మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లపై

# సీపీ ప్రత్యేక నజర్

### ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం సంబంధిత పోలీసు అధికారులు, నేషనల్ హైవే అథారిటీ, రోడ్డు రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి జాతీయ రహదారి--163పై హనుమకొండ--హైదరాబాద్ ప్రధాన రహదారి మార్గంలోని కరుణాపురం నుండి పెంబర్తి మార్గంలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్న 10కి పైగా బ్లాక్ స్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద రోడ్డు ప్రమాదాలు సంభవించడానికి గల కారణాలను పోలీస్ కమిషనర్ అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో విస్తృతంగా చర్చించి, సంబంధిత శాఖలకు పలు కీలక సూచనలు చేశారు.

ప్రధానంగా జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే అనుసంధాన రహదారులు, డివైడర్ ఓపెనింగ్‌లు ఉన్న ప్రాంతాల్లో రాత్రి వేళల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించే విధంగా తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్ల వద్ద వాహనదారులను అప్రమత్తం చేసే హెచ్చరిక బోర్డులు, దిశా నిర్దేశక సూచికలు, రిఫ్లెక్టివ్ సైన్ బోర్డులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జాతీయ రహదారి వెంట ఉన్న మద్యం దుకాణాల వద్ద వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేలా సంబంధిత వ్యాపారులు చర్యలు తీసుకునే విధంగా ఎక్సైజ్ శాఖ అధికారులు చొరవ చూపాలని సూచించారు.

పరిశీలన సందర్భంగా పోలీస్ కమిషనర్ స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కరుణాపురం వద్ద పాదచారుల వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జ్) నిర్మించాలని స్థానికులు కోరగా, అవసరమైన ప్రదేశాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి అధికారులకు సూచించారు.

అనంతరం జాతీయ రహదారి--163పై ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన బాధితులను అత్యవసరంగా ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను పరిశీలించి, అందులో అందుబాటులో ఉన్న అత్యవసర వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సిబ్బంది స్పందన, సేవల నిర్వహణ తీరును అడిగి తెలుసుకుని, మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ఘనపూర్ ఏసీపీ భీంశర్మ, ఎన్. హెచ్.ఏ.ఐ పీడీ భరద్వాజ్ ,మేనేజర్ లింగయ్య, ఇన్‌స్పెక్టర్లు వేణు, చేరాలు, ఎస్ఐలు నవీన్ కుమార్, శ్రవణ్ కుమార్, ఆర్ఎస్ఐ నవీన్ తో పాటు రోడ్డు రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ, జాతీయ రహదారి అథారిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 1933లో పుట్టిన చదువుల గుడి...

# నేడు వరండాలోనే విద్యార్థుల భవిష్యత్!

### ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, అధికారులు చదివిన ప్రభుత్వ పాఠశాలే నిర్లక్ష్యానికి బలి
### 263 మంది విద్యార్థులకు తరగతి గదులు, కిచెన్, లైబ్రరీ, ల్యాబ్, డైనింగ్ హాల్ లేక అవస్థలు
### "మా బడి సమస్యలు ఎప్పుడు తీరుతాయి సార్?" అని విద్యార్థుల ఆవేదన





**నిర్మల్ అక్షిత బ్యూరో, జూలై 23:** వందలాది మంది అధికారులు, వైద్యులు, ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులను అందించిన భైంసా మదీనా కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నేడు కనీస వసతులు లేక దయనీయ పరిస్థితిలో కొనసాగుతోంది. స్వాతంత్ర్యానికి ముందే 1933లో స్థాపించబడిన ఈ చారిత్రాత్మక పాఠశాల ప్రస్తుతం నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం ఈ పాఠశాలలో , ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో మొత్తం 263 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో ఉర్దూ మాధ్యమంలో 134 మంది, ఇంగ్లీష్ మాధ్యమంలో 139 మంది ఉన్నారు. అయితే సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు వరండాల్లో మ్యాట్లు పరుచుకుని చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రత్యేక వంటగది లేకపోవడంతో వరండాలోనే వంటలు చేస్తున్నారు. భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ కూడా లేక అదే వరండాలో పిల్లలను కూర్చోబెట్టి భోజనం పెట్టడం జరుగుతోంది. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల గది, సిబ్బంది గది, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, కిచెన్, డైనింగ్ హాల్ వంటి మౌలిక వసతులు లేకపోవడం విద్యార్థుల విద్యపై తీవ్ర ప్రభావం చూపుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పాఠశాల నుంచే ప్రస్తుత ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, నారాయణరావు పటేల్, భైంసా మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తుతో పాటు పలువురు ప్రముఖులు చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని స్థానికులు గుర్తు చేస్తున్నారు. అయినప్పటికీ తాము చదివిన పాఠశాల అభివృద్ధి విషయంలో ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపకపోవడం బాధాకరమని వారు అంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో "మన బస్తీ--మన బడి" పథకం కింద సుమారు రూ.3 కోట్లతో కొత్త భవనం నిర్మాణం ప్రారంభమైనా, నిధుల కొరత మరియు బిల్లుల సమస్యల కారణంగా పనులు పూర్తికాక మధ్యలోనే నిలిచిపోయాయని సమాచారం. ఇటీవల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అవినీతి ఆరోపణల విచారణలో సస్పెండ్ కావడంతో, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) ఉపాధ్యాయుడు శ్రీనివాస్కు ఎఫ్ఎస్‌సీ హెచ్ఎం బాధ్యతలు అప్పగించారు. ఆయనకు బోధనా బాధ్యతలతో పాటు పరిపాలనా బాధ్యతలు, మరోవైపు పట్టణంలోని పది పాఠశాలలకు కాంప్లెక్స్ హెచ్ఎం బాధ్యతలు కూడా ఉండటంతో పనిభారం అధికమైందని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి. 263 మంది విద్యార్థులకు కేవలం 12 మంది ఉపాధ్యాయులతోనే బోధన కొనసాగుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ పాఠశాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

"మా బడి నుంచి ఎంతో మంది ఉన్నత స్థానాలకు వెళ్లారు. కానీ నేడు మా చదువుల పరిస్థితిని చూసే వారు లేరు. కనీసం ఇప్పుడు అయినా మా బడి సమస్యలు పరిష్కరించండి సార్" అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## కొల్లాపూర్ నియోజకవర్గంలోని సంజీవపూర్ గ్రామంలో 100% ఎస్ఐఆర్ పూర్తి



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్ నియోజకవర్గం పెద్దకొత్తపల్లి మండలం లోని సంజీవపూర్ గ్రామంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని 100% పూర్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన గ్రామ బిఎల్ఏ భాషమోని ఆంజనేయులు కృషి అభినందనీయం. ఈ ఎస్ఐఆర్ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మదిరాజు మహిపతి, ఉపసర్పంచ్ వేనేపల్లి ప్రశాంతరావు, వార్డు మెంబర్లు భాషమోని ఆంజనేయులు, తిక్కల వెంకటేశు, మొక్తాల నిర్మల, గ్రామ పెద్దలు సంజీవరావు, శ్రీపతిరావు, సైదులు, లక్ష్మయ్య, జిపిఓ ఖాజాబాను మేడం, పంచాయతీ సెక్రెటరీ పవన్ కుమార్, బిఎల్ఓ లావణ్య, బిఎల్ఏ తిక్కల మల్లేష్, సంఘనమోని ఖాసీం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసినందుకు అధికారులు గ్రామ ప్రతినిధులను అభినందించారు.

## ప్రతిభకు ప్రోత్సాహం..

### విద్యా కుసుమం లహరిని సన్మానించిన తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్గోలి శ్రీనివాస్ రెడ్డి



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** ఇంటర్మీడియట్ పరీక్షల్లో 1000 మార్కులకు గాను 954 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన పోతేపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని లహరిని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని లహరి నిరూపించిందన్నారు. ఆమె సాధించిన విజయాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.లహరి మరింత ఉన్నత స్థాయికి చేరుకుని కుటుంబానికి,గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు,కుటుంబ సభ్యులు,గ్రామస్తులు పాల్గొని లహరిని అభినందించారు.

## ఘట్‌కేసర్‌లో కేటీఆర్‌కు ఘన జన్మదిన శుభాకాంక్షలు



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, జూలై 23:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) వరంగల్ పర్యటనకు వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యలో ఘట్‌కేసర్ ఔటర్ రింగ్ రోడ్ టోల్‌గేట్ వద్ద మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ముందస్తుగా కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. అనంతరం కేటీఆర్ నాయకులు, కార్యకర్తలతో కొద్దిసేపు ముచ్చటించి వారి అభినందనలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిఎంఆర్ బకాయిలను తక్షణమే పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**అక్షిత బ్యూరో, మంచిర్యాల :** జిల్లాలో సిఎంఆర్ బకాయిలను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని జన్నారం మండలం పొనకల్ గ్రామంలో గల శ్రీ శివసాయి రాఘవేంద్ర రైస్ మిల్లు, మర్రిగూడ గ్రామంలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లులను, దండేపల్లి మండలం లింగాపూర్‌లోని శ్రీ కృష్ణ అగ్రో ఇండస్ట్రీస్, పెద్దపేటలోని భవాని ఇండస్ట్రీస్, కన్నెపల్లిలోని వెంకటేశ్వర పీబీఆర్ఎం, రాధాకృష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆయా మండలాల తహసీల్దార్‌లతో కలిసి పరిశీలించి అధికారులతో వరి ధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) పెండింగ్ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2025--26 వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన పెండింగ్ సిఎంఆర్ బియ్యం సంబంధిత పురోగతిని సమీక్షించారు.రైస్ మిల్లులలో పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్‌ను వెంటనే పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని, నిర్దేశిత గడువులోగా సిఎంఆర్‌ను పూర్తి చేయని పక్షంలో ఆ ధాన్యాన్ని మెరుగైన పనితీరు కనబరిచే ఇతర రైస్ మిల్లులకు తరలించే చర్యలు తీసుకుంటామని రైస్ మిల్లుల యాజమాన్యాలకు సూచించారు.




అనంతరం జన్నారం, దండేపల్లి తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకొని, రికార్డులను అనుసరించి 60 రోజులకు పైగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జన్నారం, దండేపల్లి మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకం

## బి.ఎం.ఎస్.ఆర్.యు. రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్



**కరీంనగర్ అక్షిత న్యూస్:** కార్మిక శక్తియే నిజమైన జాతీయ శక్తి అని, కార్మికులంతా అంకితభావంతో, దేశభక్తితో విధులను నిర్వర్తించాలని బి.ఎం.ఎస్.ఆర్.యు.రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్ పిలుపునిచ్చారు. బి.ఎం.ఎస్. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ నగర్ కూడలిలో బి.ఎం.ఎస్.ఆర్.యు. ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్ జెండా ఆవిష్కరించి, యూనియన్ సిద్ధాంతాలను కార్యకర్తలకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కార్మిక వర్గం పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ఏ రంగానికి చెందిన కార్మికులైనా దేశభక్తితో పనిచేస్తేనే ఆ అభివృద్ధి ఫలాలు సమాజానికి అందుతాయన్నారు."దేశం బాగుంటే పరిశ్రమ బాగుంటుంది, పరిశ్రమ బాగుంటే కార్మికుడు బాగుంటాడు" అనే చక్రంలా ఈ వ్యవస్థ సాగుతుందని, అప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని వివరించారు.రాజకీయాలకు అతీతంగా, ప్రత్యేక సిద్ధాంతాలతో పనిచేస్తున్న భారతీయ కార్మిక సంఘం (బి.ఎం.ఎస్.) ప్రపంచంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా అవతరించిందని పేర్కొన్నారు. ఇటువంటి గొప్ప సంఘంలో కార్యకర్తలుగా కొనసాగడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో బి.ఎం.ఎస్. జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, బి.ఎం.ఎస్.ఆర్.యు. జిల్లా నాయకులు ఆముదుర్తి రవి, క్యాతం శ్రీనివాస్, నల్ల నవీన్, గోవిందుల సతీష్, మాదాసు విక్రమ్, వెంకటరమణ, సుల్తాన్, నక్క అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి చిన్నారులకు డిజిటల్ స్లేట్స్‌లు పంపిణీ




**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో లయన్స్ సభ్యులు తిరందాసు జగన్నాథ్ కుమారుడు ఆశ్రితరామ్ జన్మదినాన్ని పురస్కరించుకొని చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని అంగన్వాడి పాఠశాల చిన్నారులకు డిజిటల్ స్లేట్లను గురువారం అందజేశారు.

ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, చిన్నారుల్లో విద్యపై ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా భవిష్యత్తులో కూడా విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షులు ఎం.డి. అత్తహర్ పాషా, లయన్స్ క్లబ్ జిల్లా కమిటీ సభ్యులు గోషిక కరుణాకర్, క్లబ్ ట్రెజరర్ బత్తిని రఘు, సిలివేరు మంగయ్య, చింతల ప్రభాకర్ రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను భర్తరఫ్ చేయాలి..

## సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలపై కేంద్ర ఎన్ డి ఎ ప్రభుత్వం, మోడీ సర్కార్ పాశవిక దాడికి పాల్పడి లాఠీ చార్జ్ చేసి భాశ్వ వాయువు గోలాలు,నీటి ఫిరంగులను ప్రయోగించి విద్యార్థుల రక్తాన్ని ఢిల్లీ రోడ్లమీద పారించిన బిజెపి ప్రభుత్వ రాక్షస క్రీడను దేశ ప్రజలంతా మూక్కుమ్మడిగా నిరసించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు విజ్ఞప్తి చేశారు. గురువారం జూలై 23 తొండ తిరుమలగిరి మండల కేంద్రం పూలే అంబేద్కర్ తెలంగాణ చౌరస్తాలో సిపిఎం సీనియర్ నాయకుడు బూర్గుల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన వివిధ కమ్యూనిస్టులు పార్టీలు, ఎర్రజెండా సంఘాలు , సామాజిక సంఘాలు, ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నీట్, సీబీఎస్ఈ, ఎస్ఎస్సి లాంటి పరీక్షలలో పేపర్ లీకులకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ సిజెపి, పలు వామపక్ష , సామాజిక విద్యార్థి సంఘాల పోరాటానికి మద్దతుగా సోనం వాంగ్చుప్ లాంటి సామాజికవేత్త శాస్త్రవేత్త పర్యావరణవేత్త ఆమరణ నిరాహార దీక్ష 22 రోజులు చేయగా దున్నపోతు మీద వర్షం పడ్డట్టు కనీసం స్పందించని కేంద్ర ప్రభుత్వంపై మోడీ క్యాబినెట్ పై దుమ్మెత్తి పోశారు. నేషనల్ టెస్ట్ ఏజెన్సీ ను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దుశ్చర్యను ప్రభుత్వ ధమన నీతిని ప్రజలు ప్రజాతంత్ర వాదులు ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కొత్తగట్టు మల్లయ్య, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కందుకూరి ప్రవీణ్, మండల రజక సంఘం అధ్యక్షులు పులిమామిడి సోమయ్య, జిల్లా నాయకులు వంగరి బ్రహ్మం, సిపిఎం మండల నాయకులు చిత్తలూరి సోమన్న , పి బిక్షం, పి నగేష్, దూపటి లింగన్న , ఎం సి పి ఐ యు నాయకులు నలుగురి రమేష్ , సిపిఐ ప్రజానాట్యమండలి నాయకులు మల్లేష్, సిపిఐ ఎంఎల్ నాయకులు పోలేబోయిన కిరణ్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీచార్జిని ఖండిస్తున్నాం:కట్టెల లింగస్వామి



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ, జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజాస్వామికవాది, సామాజిక ఉద్యమకారుడు కట్టెల లింగస్వామి అన్నారు. గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ప్రజాస్వామికవాదుల ఆధ్వర్యంలో వలిగొండ రోడ్ లోని అంబేద్కర్ విగ్రహం ముందు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కట్టెల లింగస్వామి మాట్లాడుతూ.. దేశంలో నీట్ లాంటి ప్రశ్నాపత్రాల లీకేజీ ఏదో ఒక చిన్న తప్పిదం ద్వారా జరిగినది కాదు ఇది విద్యాశాఖ మంత్రి కనుసన్నల్లోనే లీకేజీలు జరుగుతున్నాయన్నారు.గత కొన్ని సంవత్సరాల నుండి లీకేజీల పరంపర చూస్తుంటేనే అర్థం అవుతుందని ఆయన అన్నారు. నీట్ తో పాటు వివిధ పరీక్షలకు సంబంధించి 150 పేపర్ లీకేజీ సంఘటనలు జరిగాయంటే కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందన్నారు. దీనికి బాధ్యులు అయినటువంటి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువకులు, తల్లిదండ్రులు అంతా కలిసి శాంతియుత నిరసన వ్యక్తం చేస్తున్నప్పుడు వారిపై లాఠీచార్జ్ చేయించడాన్ని దేశం మొత్తం తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. దేశంలో ఇలాంటి పరిస్థితులను చూస్తూ ఉంటే " సేవ్ ఇండియా, సేవ్ డెమోక్రసీ" అనే నినాదాన్ని దేశవ్యాప్తంగా వినిపించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజాస్వామికవాదులు బోయ సుధాకర్,బోయ కుమార్, పండి రాకేష్,ఏర్పుల సాయి,చేకూరి బాబు,కట్టెల ప్రదీప్,మాదాను ఆకాష్,ఎర్ర బాబు,ఓర్సు గణేష్, దోర్నాల వంశీ తదితరులు పాల్గొన్నారు.